బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 20 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## 26న తెలంగాణ కేబినెట్ సమావేశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 26న సాయంత్రం 4 గంటలకు తెలంగాణ మంత్రివర్గం సమావేశం కానుంది. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయం భవన్ లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ కానుంది. ముందుగా నిర్ణయించిన 23వ తేదీకి బదులుగా 26వ తేదీకి కేబినెట్ సమావేశం కానుంది. కేబినెట్ సమావేశంలో హైడ్రా, మూసీ నది ప్రక్షాళన, రైతు భరోసా విధి విధానాలు, శీతాకాల అసెంబ్లీ సమావేశాల నిర్వహణ వంటి అంశాలపై కేబినెట్ సమావేశంలో చర్చించనున్నట్లు సమాచారం. అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి ఒక ఎకరానికి రూ. 15 వేలు అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. రైతు భరోసా మార్గదర్శకాలు రూపొందించేందుకు ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ చేసింది.వివిధ వర్గాలతో చర్చలు జరిపిన కేబినెట్ సబ్ కమిటీ రైతు భరోసా గైడ్ లైన్స్ ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. దీనిపైనా కేబినెట్ భేటీలో చర్చించే అవకాశం ఉంది. హైడ్రా ఏర్పాటును హైకోర్టు సమర్థించటం, ఇప్పటికే హైడ్రాకు చట్టబద్ధత కల్పించటం లాంటి అంశాలతో పాటు మూసీ ప్రక్షాళన విషయంలో ఎలా ముందుకెళ్లాలి అనే అంశంపై ఈ భేటీలో చర్చించనున్నట్టు తెలుస్తోంది. మరోవైపు రానున్న శీతాకాల అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూడా కేబినెట్ చర్చించే అవకాశం ఉంది.

# గ్రూప్-1 పరీక్షలు యథాతథం

- పోలీసు కుటుంబాల కష్టం, నష్టాన్ని గమనించే అంతర్జాతీయ స్థాయిలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభిస్తున్నాం.
- రాష్ట్రంలోకి గంజాయి లాంటి మత్తుపదార్థాలు సరిహద్దు జిల్లాల పోలీసులు అప్రమత్తంగా ఉండాలి.
- మోసగాళ్ల మాటలు విని మోసపోవద్దు
- సీఎం రేవంత్ రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు యథాతథంగా జరుగుతాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రు.కాలయాపనకు ఫుల్ స్టాప్ పెట్టాలని ఎగ్జామ్స్ పెడుతున్నామన్నారు. హైదరాబాద్ లోని పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పరీక్షల కోసం ఎన్నో ఏళ్లుగా నిరుద్యోగులు నిరీక్షిస్తున్నారన్నారు. కొందరు రాజకీయ లబ్దికోసం అభ్యర్థులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. పదేళ్ల పాటు ఉద్యోగాలు ఇవ్వని బీఆర్ఎస్... ఇప్పుడు పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థులను రెచ్చగొడుతుందన్నారు. మోసగాళ్ల మాటలు విని మోసపోవద్దని విద్యార్థులకు సూచించారు. గ్రూప్-1 పరీక్షల విషయంలో అపోహలను నమ్మొద్దని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. రిజర్వేషన్లు సహా అన్ని నిబంధనలు పాటిస్తున్నామన్నారు.

అభ్యర్థులు పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఇప్పటికే 95 శాతం మంది అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకున్నారన్నారు. మిగిలిన 5 శాతం మంది కూడా హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. పదేళ్ల పాటు ఉద్యోగాలు ఇవ్వని బీఆర్ఎస్, బీజేపీ మాయమాటలను నమ్మకండన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే వేల సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముందుగా నోటిఫికేషన్ ఇచ్చి, ఆ తర్వాత నిబంధనలు మారిస్తే కోర్టులు కొట్టివేస్తాయన్నారు. జీవో 55 ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నష్టం జరిగేదన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌లో 1:50కి కూడా రిజర్వేషన్లు పాటిస్తున్నామని తెలిపారు. ఉద్యోగాల భర్తీపై బీఆర్ఎస్ కు చిత్తశుద్ధి లేదన్నారు. గడిచిన పదేళ్లలో ఉద్యోగాల భర్తీ చేపట్టలేదన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ నేతలు నిరుద్యోగులను ఎప్పుడైనా కలిశారా అని ప్రశ్నించారు. ఎప్పుడైనా అశోక్ నగర్‌కు వచ్చి మాట్లాడారా? కనీసం ప్రగతిభవన్‌కు పిలిపించుకున్నారా అని ప్రశ్నించారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణను కోర్టులు సమర్థించాయని, విద్యార్థులు ఆందోళనలు విరమించి పరీక్షలకు సిద్ధం కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆందోళన చేస్తున్న అభ్యర్థులను పట్ల అనుచితంగా ప్రవర్తించవద్దని పోలీసులను కోరుతున్నామన్నారు.

కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత పదేళ్లుగా వాయిదాలు పడుతూ వచ్చిన ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. 15 వేల మంది పోలీస్ సిబ్బందిని కొత్తగా నియమించామన్నారు. 65 రోజుల్లోనే 11,067 టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేశామన్నారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని కొందరు చూస్తున్నారని మండిపడ్డారు. 564 గ్రూప్-1 పోస్టులకు మెయిన్స్ పరీక్షను సోమవారం నుంచి నిర్వహించబోతున్నామని స్పష్టం చేశారు.

గతంలోని జీవో 55 రద్దుచేసి గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అదే సమయంలోనే జీవో 29 తెచ్చామన్నారు. ఈ జీవోతో రిజర్వేషన్లు ఖాళీల భర్తీ విషయంలో ఒక పోస్టు ఖాళీగా ఉన్న 1:50 పిలవాలని నిర్ణయించామన్నారు. దీంతో 31 వేల మందికి పైగా మెయిన్స్‌కు అర్హత సాధించారన్నారు. ఇప్పుడు 1:100 చొప్పున మెయిన్స్ నిర్వహించాలని ఆందోళన చేస్తున్నారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనలను

క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు తెలంగాణ పోలీసు శాఖకు స్ఫూర్తినిచ్చే విధంగా డ్యూటీ మీట్ కార్యక్రమం నిర్వహించినందుకు ఈ సందర్భంగా ఆ శాఖను అభినందించారు. నేషనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో కూడా తెలంగాణ పోలీసులు రాణించాలని ఆకాంక్షించారు. అందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు. దేశంలోనే మిగతా పోలీసులకు ఆదర్శంగా నిలువాలని కోరారు. సైబర్ క్రైమ్స్, మాదక ద్రవ్యాల రవాణా వంటి కొత్త పుంతలు తొక్కుతున్న నేరాలను అరికట్టడానికి పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు.కానిస్టేబుల్ కిష్టయ్య లాంటి ఎంతో మంది త్యాగాలను తెలంగాణ ప్రజలు మరిచిపోలేదు. పోలీసు ఉద్యోగం జీవనోపాధి కోసం చేసే ఉద్యోగం కాదు. ఇదొక భావోద్వేగం. పోలీసు కుటుంబాల కష్టం, నష్టాన్ని గమనించే అంతర్జాతీయ స్థాయిలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభిస్తున్నాం.

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నందునే హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగింది. రాష్ట్రంలోకి గంజాయి లాంటి మత్తుపదార్థాలు సరిహద్దు జిల్లాల పోలీసులు అప్రమత్తంగా ఉండాలి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2013 లో కాకినాడలో జరిగిన పోలీస్ డ్యూటీ మీట్ తర్వాత తెలంగాణలో తొలిసారి డ్యూటీ మీట్ నిర్వహణకు అంగీకరించడంపై డీజీపీతో పాటు పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు.

పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడంలో అనుసరించాల్సిన విధి విధానాలపై రూపొందించిన పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. పోలీసు శాఖకు సంబంధించి వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ట్రోఫీలు అందజేశారు. మొదటి బహుమతి పొందిన టీమ్‌కు రూ. 5 లక్షలు, రెండో బహుమతికి రూ3 లక్షలు, మూడో బహుమతిగా రూ. 1.5 లక్షల నగదు అవార్డును ప్రకటించారు.ఈ కార్యక్రమంలో హోం సెక్రెటరీ రవి గుప్తా గారు, డీజీపీ జితేంద్ర గారు, ఇంటలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి గారు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీపీ (సీఐడీ) శిఖా గోయల్ గారు, ఇతర ఉన్నతాధికారులు, వివిధ విభాగాల పోలీసులు పాల్గొన్నారు.

## మూసీ పేరుతో ప్రజాధనం లూటీ



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నాగోల్ ఎస్టీపీ పరిశీలన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు రేవంత్ రెడ్డి ప్లాన్ వేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రూ.26 వేల కోట్లతో మొత్తం మూసీ పునరుజ్జీవం అవుతుందని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ అభివద్ధికి తాము వ్యతిరేకం కాదని మూసీ ప్రక్షాళన పేరుతో మూసికి ఇరువైపులా ఉన్న నిరుపేదలకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా వారి ఇండ్లను కూల్చి వేస్తూ వారిని నిరాశ్రయులను చేస్తూ దోచే దోపిడికి వ్యతిరేకమన్నారు.

హైదరాబాద్ నాగోల్‌లోని ఎస్టీపీని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కేటీఆర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నాగోల్‌లో దేశంలోనే అతిపెద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించామని చెప్పారు. ఇక్కడ శుద్ధి చేసిన నీళ్ల నల్లగొండ జిల్లాకు పోతాయన్నారు. రేవంత్ రెడ్డి కొత్తగా చేసేదేం లేదన్నారు. ఈ ఎస్టీపీలను సక్రమంగా నడుపుకుంటే చాలన్నారు. మూసీ నది హైదరాబాద్ ఒక వరమని, దానిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వా లేనని చెప్పారు. హైదరాబాద్‌లో రోజూ 20 కోట్ల లీటర్ల మురికినీరు ఉత్పత్తి అవుతున్నదని తెలిపారు. దక్షిణాసియాలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే నగరం లేదని వెల్లడించారు. మురుగునీటిని వంద శాతం శుద్ధి చేస్తున్నది ఒక్క హైదరాబాద్‌లోనేనని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే ఈ ఘనతను సాధించామన్నారు. రూ.3,800 కోట్ల ఖర్చుతో ఎస్టీపీల నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. నగరంలోని 54 నాలాల నుంచి మూసీలోకి మురికి నీరు వస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఎస్టీపీలను రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో 57.7 కిలోమీటర్లు మూసీ ప్రవహిస్తుందన్నారు. మూసీపై 15 చోట్ల బ్రిడ్జిలను నిర్మించాలని ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. చారిత్రక, వారసత్వ సంపదను కాపాడుతూ ఆధునికంగా నిర్మించాలని నిర్ణయించామన్నారు. బ్రిడ్జిల నిర్మాణానికి రూ.545 కోట్లు మంజూరు చేశామన్నారు. రోడ్ కం బ్రిడ్జ్ కం చెక్ డ్యాం నిర్మించాలనుకున్నామని చెప్పారు. మూసీపై రూ.10 వేల కోట్లతో భారీ స్కై ఓవర్ నిర్మించాలనుకున్నామని తెలిపారు.

## ఈ సారి ఖరీఫ్‌కు రైతు భరోసా ఇవ్వలేం




- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఈ ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా ఇవ్వబోమని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. రైతు భరోసాకు బదులుగా ప్రతీ సన్న ధాన్యం పండించిన రైతుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించారు. పంట వేసిన రైతుకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టుగా ఆయన తెలిపారు. వ్యవసాయం చేయని వారికి రైతు భరోసా ఇవ్వబోమని తేల్చి చెప్పారు."ఈ ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా ఇవ్వలేము. మార్పులకు అనుగుణంగా రైతులను మారుస్తాం. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా ముఖ్యమంత్రి రుణమాఫీ అంశాన్ని తన భుజాన వేసుకున్నారు. గతంలో వైఎస్సార్ హయాంలో 70 వేల కోట్ల రుణమాఫీ చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశాం. 42 బ్యాంకుల నుంచి వివరాలు తెప్పించుకుని రుణమాఫీ చేసాం. రాష్ట్రంలో 42 లక్షల లబ్ధిదారులకు, 25 లక్షల కుటుంబాలకు 31 వేల కోట్లు అవసరం. 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ ఆగస్టు 15నే చేశాం. 20 లక్షల మందికి ఇంకా రుణమాఫీ చేయాల్సి ఉంది. 2 లక్షల పైన ఉన్న డబ్బులు కడితే రుణమాఫీ అవుతుంది. తెల్ల రేషన్ కార్డు లేని 3 లక్షల మందికి డిసెంబర్ లో కుటుంబ నిర్ధారణ చేసి వారికి కూడా రుణమాఫీ చేస్తాం. 2500కోట్ల రూపాయలు వేస్తాం. రుణ విముక్తి కావాలంటే కొత్త రుణాలు రావు" అని తుమ్మల వ్యాఖ్యానించారు.

2 లక్షల పైన ఉన్న రుణాల వారి అంశం క్యాబినెట్ లో చర్చిస్తామని తెలిపారు. పంటల బీమా గతంలో లేకపోయినప్పటికీ ఇప్పుడు రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతీ రైతు పంటకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని, రాష్ట్రంలో పండే అన్ని పంటలను ఎంఎస్పీ ప్రకారమే కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన అన్ని పంటలను కేంద్రం కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు 20% కేంద్రం కొనుగోలు చేస్తుందని తుమ్మల అన్నారు.

## ఇజ్రాయెల్ ప్రధాని లక్ష్యంగా డ్రోన్ల దాడి



బలగం టీవీ, హైదరాబాద్

గత ఏడాది అక్టోబర్7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి సూత్రధారి అయిన యాహ్యా సిన్వర్ హతమైనప్పటికీ హమాస్ తన పోరాటం కొనసాగిస్తుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో శనివారం సిజేరియా లోని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నివాస భవనం లక్ష్యంగా శనివారం డ్రోన్ దాడి జరిగింది. హెజ్‌బొల్లా కేంద్రమైన లెబనాన్ వైపు నుంచి డ్రోన్లు దూసుకొచ్చినట్టు ఇజ్రాయెల్ దళాలు వెల్లడించాయి. లెబనాన్ నుంచి ప్రయోగించిన ఓ డ్రోన్ శనివారం దక్షిణ హైఫా లోని సిజేరియా లోని నెతన్యాహు నివాస భవనం సమీపంలో పేలిపోయిందని రాయిటర్స్ నివేదించింది. ఈ డ్రోన్ దాడిలో భవనం కొంత భాగం దెబ్బతింది. అయితే ఈ దాడిలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఒక భవనాన్ని డ్రోన్ ఢీకొట్టినట్టు తెలిపాయి. అయితే ఆ సమయంలో నెతన్యాహు కానీ, ఆయన భార్య కానీ ఆ భవనంలో లేరని ఇజ్రాయెల్ దళాలు వెల్లడించాయి.

లెబనాన్ ప్రయోగించిన మరో రెండు డ్రోన్లను ఇజ్రాయెల్ వాయుదళాలు టెల్ అవీవ్ ప్రాంతంలో కూల్చివేశబ్బూయి. అయితే మూడోది మాత్రం సిజేరియా లోని ఓభవనాన్ని ఢీకొట్టడంతో పెద్దశబ్దంతో పేలుడు సంభవించింది. సిజేరియా లోని భవనాన్ని ఢీకొనడానికి ముందు లెబనాన్ నుంచి 70 కిమీ దూరంలో ఎగిరిందని ఇజ్రాయెల్ మీడియా పేర్కొంది. నెతన్యాహు ప్రైవేట్ నివాస భవనంపై దాడితోపాటు శనివారం ఉదయం ఉత్తర ఇజ్రాయెల్‌లో 55 క్షిపణులు లెబనాన్ నుంచి దూసుకొచ్చాయని, ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఆ సమయంలో కారులో కూర్చుంటున్న 50 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడని , మరో నలుగురు గాయపడ్డారని పేర్కొంది. ఇదిలా ఉండగా, బింట్ జెబెయిల్ అనే దక్షిణ పట్టణంలో హెజ్‌బొల్లా డిప్యూటీ కమాండర్ నస్సేర్ రషీద్‌ను శనివారం హతమార్చినట్టు ఇజ్రాయెల్ వెల్లడించింది. బీరుట్‌లో ఉత్తర ప్రాంతంలో జాతీయ రహదారిపై ఉన్న వాహనంపై ఇజ్రాయెల్ వాయుసేన దాడిలో ఇద్దరు మృతి చెందారని లెబనాన్‌లో ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది.

## జీవో 29 రద్దు చేయాలి

**గ్రూపు-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలి**
**చలో సెక్రెటేరియట్‌కు తరలిన గ్రూప్ 1 అభ్యర్థులు**
**మద్దతుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ నిరసన.. అరెస్టు**



బలగం టీవీ, హైదరాబాద్

గ్రూప్ -1 అభ్యర్థుల పోరాటం కొనసాగుతోంది. పరీక్ష యధాతథంగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశించినా మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాలంటూ మరోసారి ఆందోళనకు దిగారు. శనివారం వారు ర్యాలీగా సచివాలయానికి బయలుదేరారు. తెలుగుతల్లి ఫ్లై ఓవర్ వద్ద వీరికి బీఆర్ఎస్, బీజేపీ నేతలు మద్దతు పలికారు. అయితే ఈ సమయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. ముందుగు సచివాలయానికి ర్యాలీగా వెళ్తున్న గ్రూప్ వన్ అభ్యర్థులకు మద్దతుగా వచ్చిన బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్‌లను కొందరు గూప్‌వన్ అభ్యర్థులు అడ్డుకున్నారు. గులాబీ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గో బ్యాక్‌అంటూ నినాదాలు చేశారు. ఇదే సమయంలో అక్కడకు బీజేపీ నేతలు రావడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా అక్కడకు చేరుకున్నారు. గ్రూప్1 మెయిన్స్ పరీక్షపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఆందోళనలో ఉన్న విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తారని ఆయన ప్రశ్నించారు. జీవో 29పై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు.

ఇదిలా ఉండగా శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గ్రూపు-1 బాధిత అభ్యర్థులతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడారు. శుక్రవారం జరిగిన లాఠీచార్జి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిటీలైబ్రరీలో నిరుద్యోగులతో భేటీ అయ్యేందుకు బయలుదేరిన ఆయన అకస్మాత్తుగా అశోక్‌నగర్ చౌరస్తాలో రోడ్డుపై బైటాయించారు. అప్పటికే అక్కడ బీజేపీ కార్యకర్తలు, నిరుద్యోగులు పెద్దఎత్తున పోగయ్యారు.సీఎం డౌన్‌డౌన్.. జీవో 29 రద్దు చేయాలి.. గ్రూపు-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలి.. న్యాయం కావాలి' అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయంలో చలో సెక్రెటేరియేట్‌కు తరలిరావాలని బండి పిలుపు నిచ్చారు. అయితే, నిరుద్యోగులు, బీజేపీ కార్యకర్తలు ముందుకెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. కాసేపటి తర్వాత నిరుద్యోగులు, బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని ర్యాలీగా ముందుకుసాగారు. వారిని అడ్డుకున్న పోలీసులు బండి సంజయ్‌ని తరలించేందుకు యత్నించారు. కానీ, నిరుద్యోగులు అడ్డుకున్నారు. కొద్దిముందుకు వెళ్లగానే తెలుగు తల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మరోమారు బండి సంజయ్ బైటాయించారు. ఆయనకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తోడయ్యారు. నిరుద్యోగులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, గజ్జెల నగేశ్, ముఠా జయసింహ, శ్రీనివాస్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు అక్కడకు చేరుకున్నారు. వారికి వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీనికి కొందరు నిరుద్యోగులు కూడా



## సికింద్రాబాద్‌లో ఉద్రిక్తత

బలగం టీవీ, హైదరాబాద్

సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వంసం ఘటనపై కొన్ని హిందూ సంస్థలు శనివారం చేపట్టిన బంద్ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఆలయం వద్ద పెద్దఎత్తున హిందూ సంఘాలు ఆందోళనకు దిగారు. పరిస్థితి చేయిదాటే ప్రమాదం ఉండటంతో పోలీసులు లాఠీలకు పని కల్పించారు. ఈ లాఠీచార్జిలో ముగ్గురు ఆందోళనకారులు, ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. పూర్తి వివరాలి ఉన్నాయి..

ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ధ్వంసం ఘటనపై ఇప్పటికే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది మహంకాళి ఆలయం నుంచి ముత్యాలమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుడి వద్ద ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గుడికి సమీపంలో ఉన్న మరో ప్రార్థన మందిరంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. వెంటనే పోలీసులు అప్రమత్తమై అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, మత సంస్థల నిర్వాహకుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసులపై కొందరు రాళ్లు, చెప్పులు, కర్రలు విసిరారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టారు. ఈ ఘటనలో ముగ్గురు ఆందోళనకారులు, ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. వీరిని వెంటనే ఆస్పత్రికి తరలించారు.పోలీసులు చెదరగొట్టిన కొద్దిసేపటికే మళ్లీ ఆలయం ఎదుట ఆందోళనకారులు గుమిగూడారు. దాంతో వివిధ పోలీసు స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్, రాపిడ్ యాక్షన్ విభాగాల నుంచి భారీగా పోలీసులు అక్కడ మోహరించారు. ఈ క్రమంలో ఆందోళనకారులు రెచ్చగొట్టేలా ప్రవర్తించినా పోలీసులు చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. వారిని నిలువరించి ఒక్కొక్కరిని బయటకు పంపారు. ఆందోళనకారులకు బీజేపీ కార్పొరేటర్ కొంతం దీపిక, పోలీస్ ఉన్నతాధికారులు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించేశారు.

## జమ్ము కశ్మీర్ రాష్ట్ర హోదా తీర్మానానికి ఎల్జీ ఆమోదం

బలగం టీవీ, హైదరాబాద్

జమ్ము కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూ సీఎం ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని మంత్రివర్గం చేసిన తీర్మానానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదం తెలిపారని శనివారం అధికారులు తెలిపారు. గతంలో ఉన్న రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలంటూ గురువారం ఒమర్ అబ్దుల్లా మంత్రివర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. కాగా, జమ్ముకశ్మీర్‌లో 370వ అధికరణ పునరుద్ధరణ కోసం కాకుండా కేవలం రాష్ట్ర హోదాపై మంత్రివర్గం తీర్మానం చేయడాన్ని విపక్షాలు తప్పుబట్టాయి.

# ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు సహకరించాలి..

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి బ్యాంకర్లు కృషి చేయాలి..
- బ్యాంకింగ్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలి..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువయ్యే విధంగా చూడాలని, మారుమూల ప్రాంత గ్రామాలకు కూడా బ్యాంకు సేవలు అందాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బ్యాంకర్లతో నిర్వహించిన డి.సి.సి, /డి.ఎల్.ఆర్.సి జూన్ త్రైమాసిక సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మన జిల్లాలో ఉన్న జనాభాకు అనుగుణంగా బ్యాంకుల సంఖ్య ఉందా పరిశీలించాలని , ప్రజలకు బ్యాంకింగ్ సేవలు చేరువ చేసే దిశగా మన జిల్లాలో ఉన్న రుద్రంగి, మల్యాల, నిజామాబాద్ గ్రామంలో నూతన బ్యాంక్ లు అవకాశం మేరకు ఏర్పాటు చేయాలని అన్నారు.రానున్న 3 మాసాలలో జిల్లాలోని యువతీ యువకులకు స్వయం ఉపాధి రంగాలలో అభివృద్ధి చెందేలా మరియు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి సుమారు 1000 మందికి రుణాలు అందజేయాలని అన్నారు. ప్రతి గ్రామం 500 నివాసాలు గల జనావాసం, 5 కిలోమీటర్ల రేడియస్ లో బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. రుద్రంగి, మల్యాల, నిజామాబాద్ గ్రామాలలో మంచి జనాభా ఉందని, ఇక్కడ బ్యాంకింగ్ సేవలు ప్రారంభిస్తే ప్రజలకు ఉపయోగపడుతుందని అన్నారు.

ప్రజలకు బ్యాంకుల ద్వారా అందిస్తున్న వివిధ రకాల రుణాలు తదితర అంశాలపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, ప్రజల అనవసరంగా మైక్రో ఫైనాన్స్ కంపెనీలు, లోన్ యాప్ ల నుంచి రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి రాకుండా ఉంటుందనిఅన్నారు . బ్యాంకర్లు నిర్వహించే అవగాహన కార్యక్రమాలపై ఒకరోజు ముందుగానే అక్కడ సమాచారం అందజేయాలని, బ్యాంకర్లు మానవత దృక్పథంతో సైతం పని చేయాలనిఅన్నారు . సామాన్యులకు బ్యాంకు లావాదేవీల పట్ల మరింత అవగాహన కల్పించాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాల మంజూరు సకాలంలో చేయాలని,ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మెప్మా తరపున వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు వచ్చే ప్రతిపాదనలు పరిశీలించి రుణాలు త్వరగా అందేలా చూడాలని అన్నారు.

వేములవాడ దేవాలయం దగ్గర చిన్న చిన్న దుకాణాలు, వ్యాపారాలు నడిపే వ్యక్తులు బయట 3 శాతం, 5 శాతం వడ్డీలకు వ్యాపార నిమిత్తం అప్పులు తీసుకుంటున్నారని, వీరిని గుర్తించి పీఎం స్వానిధి క్రింద రుణాలు అందజేయాలని అన్నారు . రుద్రంగిలో కెనరా బ్యాంక్ , మల్యాల లో యు బి ఐ, నిజామాబాద్ గ్రామాలలో ఎస్బిఐ బ్యాంక్ బ్రాంచ్ లు ఏర్పాటు చేయవలసిందిగా ప్రభుత్వ విప్ ప్రతిపాదించగా, దానికి బ్యాంకర్లు సుముఖము వ్యక్తం చేసి వారి హెడ్ ఆఫీస్ పర్మిషన్ తీసుకొని త్వరలో బ్యాంకులు ప్రారంభిస్తామని తెలిపారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ప్రజలలో ఆర్థిక అక్షరాస్యత పెంచే దిశగా బ్యాంకర్లు విస్తృతంగా క్యాంపులు నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత, మహిళా సంఘాలకు అవసరమైన శిక్షణ అందించి బ్యాంకు లింకేజీ ద్వారా స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు దిశగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, జిల్లా పరిశ్రమల అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలనిఅన్నారు. ప్రగతి - సోషల్ సెక్యూరిటీ పథకాల పై గ్రామీణ ప్రాంతాలలో అవగాహన కల్పించాలని, అర్హులైన జన్ ధన్ ఖాతాదారులందరికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా పథకాలు అందేలా చూడాలని , రాబోయే 3 నెలల కాలంలో అర్హులైన ఖాతాలను గుర్తించి వారికి పి.ఎం.ఎస్.బి.వై, పి.ఎం.జె.జె.బీ.వై పథకాలు వర్తింపజేయాలని అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంట రుణాల కింద 2024-25 సంవత్సరానికి 77,425 ఖాతాలకు 1519 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, జూన్ చివరి నాటికి 14,476 ఖాతాలకు 201 కోట్లు మాత్రమే పంపిణీ చేయడం జరిగిందని, రుణమాఫీ ప్రక్రియ ముగుస్తున్నందున రుణాల రెన్యువల్ పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాన్ని సాధన దిశగా కృషి చేయాలని అన్నారు. వ్యవసాయ టర్మ్ రుణ లక్ష్యం 421 కోట్లకు గాను 135 కోట్లు మాత్రమే అందజేయడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ బ్యాంకులు వ్యవసాయ టైం రుణ లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలని అన్నారు. కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసిఐసి బ్యాంకు వ్యవసాయ టర్మ్ రుణ లక్ష్యాల పై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

చిన్న ,సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు రుణాల పంపిణీ నిర్దేశించిన లక్ష్యంలో 32 శాతం మాత్రమే పూర్తి చేశామని తెలిపారు. మహిళా సంఘాలకు అందించే రుణాల పరిమితిని 20 లక్షల వరకు పెంచడం జరిగిందని దీని ప్రకారం రుణాల పంపిణీ బ్యాంకర్లు చేయాలని అన్నారు.స్వశక్తి మహిళా సంఘాలకు నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం రూరల్ సెర్ప్ ద్వారా 56.37 శాతం, మెప్మా ద్వారా 30.82 శాతం రుణాలు పంపిణీ చేశామని అన్నారు. ప్రధానమంత్రి స్వానిధి పథకం కింద వీధి వ్యాపారులకు రుణ సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని, సిరిసిల్లలో నేత కార్మికులకు, వేములవాడ దేవాలయం పరిసరాల్లోని వ్యాపారులను, మార్కెట్ యార్డ్ దగ్గర, ఉన్న చిన్న చిన్న వ్యాపారులను పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది సర్వే నిర్వహించి వారి రోజు అవసరాల నిమిత్తం పీఎం స్వానిధి క్రింద మరియు ఇతర రుణాలు అందించాలని ఆదేశించారు.

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద సెప్టెంబర్ నాటికి 59 ప్రాజెక్టులకు 2 కోట్ల 99 లక్షల రుణాలు అందించడం వల్ల 855 మన యువకులకు ఉపాధి కల్పన జరిగిందని, ముద్రా యోజన పథకం ద్వారా జూన్ చివరి నాటికి 1551 యూనిట్లకు 25 కోట్లతో 94 లక్షల రుణాలు అందించామని అన్నారు. పి.ఎం.ఎఫ్.ఎం.ఈ. క్రింద ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రోత్సహించే దిశ ప్రస్తుతం ఉన్న యూనిట్ల విస్తరణకు, నూతన యూనిట్ల గ్రౌండింగ్ చర్యలు తీసుకోవాలని అన్నారు. పి.ఎం.ఎఫ్.ఎం.ఈ. క్రింద ఇప్పటివరకు 648 దరఖాస్తులు రాగా 267 రుణాలు మంజూరు చేయడం జరిగిందని, వీటిలో 213 రుణాల పంపిణీ పూర్తి అయిందని, 299 దరఖాస్తులు తిరస్కరించామని అధికారులు తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలో రుణాలు మంజూరు చేసినప్పటికీ 32 మంది దరఖాస్తు దారులకు రుణాలు పంపిణీ చేయకపోవడానికి గల కారణాలను ఆరా తీశారు. మంజూరు చేసిన రుణాలను వేగవంతంగా పంపిణీ చేసి యూనిట్ త్వరగా గ్రౌండ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రుణమాఫీ ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని 43 వేల 770 రైతులకు 346 కోట్ల 63 లక్షల సొమ్ము ప్రభుత్వం విడుదల చేసిందని, ఇప్పటివరకు 40 వేల 331 రైతులకు 324 కోట్ల 45 లక్షల 2011 పూర్తయిందని, పెండింగ్ రెన్యువల్ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. ఈ.డి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2 వేల పాడి పశువుల యూనిట్లను 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు లింకేజ్ రుణాలతో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించి మొదటి దశలో 619 యూనిట్ల పంపిణీ పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని, ఇప్పటి వరకు 236 యూనిట్ల గ్రౌండ్ చేశామని అన్నారు.

మొదటి దశలో మంజూరు చేసిన పాడి పశువుల యూనిట్ల సబ్సిడి సొమ్ము ప్రభుత్వం విడుదల చేసిందని, ఎస్సి అధికారులు బ్యాంకర్లు సమన్వయంతో పని చేసి సంబంధిత లబ్దిదారులచే పాడి పశువుల యూనిట్ త్వరగా గ్రౌండ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, ఆర్బీఐ ఎల్డిఓ సాయి తేజ రెడ్డి, నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర, యుబిఐ డీజీఎం అపర్ణ రెడ్డి, వివిధ బ్యాంక్ కంట్రోలర్లు, మేనేజర్లు, సంబంధిత జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదు



- మైక్రో ఫైనాన్స్ లోన్ రికవరీలో వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల,**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు విరుద్ధంగా జిల్లాలో మైక్రో ఫైనాన్స్ లోన్ రికవరీలో వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మైక్రో ఫైనాన్స్ కంపెనీలను హెచ్చరిస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో మైక్రో ఫైనాన్స్ కంపెనీ వారు, వడ్డీ వ్యాపారులు , లోన్ యాప్ సంబంధిత వర్గాలు కిస్తిల చెల్లింపులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాల్సి ఉంటుందని అన్నారు.లోన్ రికవరీ కోసం వేధింపులకు గురి చేయడం, ఇంటి దగ్గరికి వెళ్లి అవమానించడం, ఇష్ట రాజ్యాంగ వ్యవహరించడం లాంటివి మానివేయాలని లేనిపక్షంలో చట్ట ప్రకారం పోలీస్ కేసులు, కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మైక్రో ఫైనాన్స్ వాళ్ళు డబ్బులు చెల్లించాలని వేధిస్తే బాధితులు నేరుగా తనను కలవాలని, వేధింపు దారుల నుంచి రక్షణ కల్పిస్తామని, అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడటం సరైన నిర్ణయం కాదని, మీపై ఆధారపడి ఉన్న కుటుంబం ఏమైపోతుందో ఆలోచించాలని పేర్కొన్నారు.

# హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనుల భూ సేకరణకు నిధులు మంజూరు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ , వేములవాడ**

వేములవాడ తిప్పాపూర్ వద్ద హై లెవెల్ బ్రిడ్జి భూసేకరణ నిమిత్తం ప్రభుత్వం రూ. 6 కోట్ల 96 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసి కలెక్టర్ ఖాతాలో జమ చేసిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ 2015 లో ప్రారంభమైన వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు భూసేకరణ నిధులు కేటాయించకపోవడంతో గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లగా భూసేకరణ నిమిత్తం 6 కోట్ల 96 లక్షల నిధులు మంజూరు జిల్లా కలెక్టర్ పిడి ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు.ఈ హై లెవెల్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభించి పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.



# శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలి

- ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేసి కేసుల్లో శిక్షల శాతం పెంచాలి...
- ఎస్పీ అఖిల్ మహాజన్



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేసి కేసుల్లో శిక్షల శాతం పెంచాలని,పెండింగ్ కేసులపై పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవతో కేసుల్లో పురోగతి సాధిస్తూ, కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలో జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ అఖిల్ మహాజన్ నేర సమీక్ష సమావేశం నిర్వహించినారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పిర్యాదు స్వీకరణ నుండి కేసు నమోదు చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేసి కోర్టులలో నిందుతులకు శిక్షలు విధముగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని అన్నారు.ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్బెయిలబుల్ వారెంట్లను నిందితులపై అమలుపరచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని అన్నారు .

జిల్లాలో హిస్టరీ, రౌడీ షీటర్స్ పై ,గ్రామాల్లో, పట్టణాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఏర్పాటు చేసి వారి పట్ల కఠినంగా వ్యహరించాలన్నారు.నేర పరిశోధనలో సీసీ కెమెరాల ప్రాముఖ్యత పై ప్రజలను, వ్యాపారస్థులకు అవగాహన కల్పిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని, అక్రమ కార్యకలాపాలు అయిన గంజాయి, గుట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట, గుడుంబా, పీ డి ఎస్ రైస్, వాటి పై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలని బహిరంగ ప్రదేశాల్లోమద్యం చేసేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు.

మీకోసం ప్రోగ్రాంలో భాగంగా పోలీస్ అధికారులు , సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ రోడ్ ప్రమాదాలు, ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలు, షీ టీమ్ ,చట్టాలపై అవగాహన కల్పించాలని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన ఫంక్షనల్ వర్టికల్స్ పటిష్ట అమలు పరుస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ వివిధ విధి నిర్వహణలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంశ ప్రోత్సాహకాలు అందించారు.ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,సిఐ కృష్ణ, మొగిలి , శ్రీనివాస్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆర్.ఐ లు యదగిరి, మధుకర్, రమేష్,ఎస్ఐ లు, ఐటీ కోర్ సిబ్బంది, పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండలంలోని గోపాల్ రావు పల్లె,అంకిరెడ్డి పల్లె గ్రామాలలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను ఎ ఏం సి చైర్మన్ వేముల స్వరూప తిరుప తిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ రైతులు దళారుల బారిన పడకుండా పండించిన వారి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తమని తెలిపారు.ఈ కార్యక్రమంలో,ఎ ఎం సీ వైస్ చైర్మన్ నేరళ్ళ నర్సింగం గౌడ్,కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్, మిరాల శ్రీనివాస్ యాదవ్, స్థానిక నాయకులు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఐడీ కార్డుల అందజేత



**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని సారంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల లోని విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుగ్గిళ్ళ భరత్ గౌడ్ తన స్వంత ఖర్చులతో ఐడి కార్డులను అందజేశారు.అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు బదిలీ పై వెళ్ళుతున్న ఎల్లయ్య, శ్రీనివాస్ లను శాలువ తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎ ఎంసి డైరెక్టర్ గుగ్గిళ్ళ రాములు, ఎండీ. హనీఫ్, జింక ఆనందం, వంగపెల్లి శ్రీనివాస్,కోలా శ్రీనివాస్,సుంకటి మహేష్, గుండి పరశురామ్, గుగ్గిళ్ళ శరత్,గుగ్గిళ్ళ అభిషేక్, గుగ్గిళ్ళ హరికృష్ణ, కోలా సాయి, రాధ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.


# కర్ర సాములో ఉత్తమ ప్రతిభ

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన బండి మనోజ్ఞ అనే చిన్నారి జిల్లా కేంద్రంలో హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన కర్రసాము శిక్షణ లో 15 రోజుల శిక్షణ పూర్తి చేసుకొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్ చేతుల మీదుగా మెమెంటో తో పాటు ప్రశంస పత్రం అందుకుంది. విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం, ధ్యానం కర్రసాము నేర్చుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మిరాజం, డిస్ట్రిక్ట్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ కమటం అంజయ్య, చింతోజు భాస్కర్, హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ తోపాటు మండెపల్లి గ్రామస్తులు సైతం చిన్నారిని అభినందించారు.




# దగ్గుమందు కూడా లేని దయనీయ పరిస్థితుల్లో ప్రభుత్వ ధవాఖానలు...



- బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి

**బలగం టీవీ , ముస్తాబాద్**

ప్రభుత్వ హాస్పిటల్ ను పట్టించుకునే నాధుడే లేదు అని, సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టు లేదు అని, దగ్గు మందు కూడా లేని దయనీయస్థితిలో ప్రభుత్వ ధవాఖానలు ఉన్నాయని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి అన్నారు.ఈ సందర్భంగా శీలం స్వామి, మెంగని మనోహర్ మాట్లాడుతూ (24 గంటలు 7 రోజులు) ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సిన ఈ ఆసుపత్రిలో ఒక్క స్టాఫ్ నర్సు ఉండటమెంటని, గత మార్చి నుండి ఒక్క ప్రసవం కూడా దవాఖానలో జరగకపోవడం ఇది పేదలపట్ల ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యమని అన్నారు.. నాడు కేసీఆర్ ప్రభుత్వం పేదలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దవాఖానలో అన్నీరకాల మందులు అందుబాటులో ఉంచారని, వృద్ధులకు ఇబ్బంది లేకుండా అన్ని మందులను అందించారని, ముఖ్యం గా గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక శ్రేద్ధ వహించారని వారు రక్తహీనకు గురికావద్దని ఐరన్ మాత్రలు, న్యూట్రిషన్ కిట్లు, పౌష్టికాహారం అందించారని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతిలు జరిగేలా చర్యలు తీసుకున్నారని ప్రసూతి తర్వాత తల్లి బిడ్డను క్షేమంగా ప్రభుత్వ వాహనంలో ఇంటికి చేర్చి అమ్మాయి పుడితే 13000 అబ్బాయి పుడితే 12000 అందించి పేదవారికి అండగా బీఆర్ఎస్ సర్కార్ ఉంటే... ఇనాడు కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి, పేద ప్రజలను, వృద్ధులను, గర్భిణీ స్త్రీలకు సరైన వైద్యం అందించకుండా ఆగం చేస్తుందని అన్నారు. ఇది కేవలం ముస్తాబాద్ మండలంలోనే కాదని రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇదే పరిస్థితి ఉన్నదని, పక్షం రోజుల్లో ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ దవాఖానలపై దృష్టి పెట్టకుంటే రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆది శేఖర్, కిట్టు, బాధవేణి మహేష్, యండి. జహంగీర్, నరేంద్రచారి, బండ గణేష్, ఈస ప్రశాంత్, బండారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థలలో యాంటి డ్రగ్స్ కమిటీల ఏర్పాటు

- గంజాయి తో పాటు గుడుంబా నివారణకు పక్కా కార్యాచరణ..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల:**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాదక ద్రవ్యాల గంజాయి నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని ఎస్పీ అఖిల్ మహజాన్ తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు జిల్లాలో సంబంధిత శాఖ అధికారులను పక్కా కార్యాచరణతో కృషి చేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న 525 ప్రభుత్వ పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని, వీటిని యాక్టివ్ గా ఉంచుతూ డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాల పై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండాలని, పిల్లలకు డ్రగ్స్ పై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని అన్నారు.

కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యా సంస్థల్లో నిర్వహించే పేరెంట్ టీచర్స్ సమావేశాలలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్ధాలకు బానిసలుగా మారితే వచ్చే పరిణామాలు, మాదకద్రవ్యాల బానిసత్వం నివారణకు ప్రభుత్వం సిరిసిల్ల రాజీవ్ నగర్ బస్తీ దవఖానలో ఏర్పాటు చేసిన డి అడిక్షన్ సెంటర్ మొదలగు అంశాలను వివరించాలని, పేరెంట్స్ చుట్టుపక్కల ఎవరైనా పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందజేయాలనిఅన్నారు..

డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాల పై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలనీ ,జిల్లాలో గంజాయి తో పాటు గుడుంబా నివారణకు సైతం అవసరమైన చర్యలు కచ్చితంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లా లోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్స్ పెక్టర్ కు సూచించారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియ జేయాలని అన్నారు.

ఎస్పీ అఖిల్ మహజాన్ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో డ్రగ్స్ మాదకద్రవ్యాల నియంత్రణకు పక్కానిగా ఏర్పాటు చేశామని, గత సంవత్సర కాలంగా మాదకద్రవ్యాలకు సంబంధించి 17 కేసులో నమోదు చేసి దీనికి సంబంధించిన 160 పైగా వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందనిఅన్నారు . డ్రగ్స్ నివారణ కోసం సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు .మాదక ద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్, గుడెంబా సంబంధించి పౌరులకు ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656426 కు తెలియజేయాలని , సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు . ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో ఎల్.రమేష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, మెడికల్ సూపరింటెన్డెంట్ లక్ష్మినారాయణ, డిఈఓ రమేష్ కుమార్ , ఇన్చార్జి డీఏఓ రామరావు, డిఐఓ. శ్రీనివాస్, డ్రగ్ ఇన్స్పెక్టర్ భవాని, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి..



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ, సిరిసిల్ల :**
ధాన్యం కొనుగోలు కేంద్రాల లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలనీ కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం లాల్ సింగ్ తండా, వన్ పల్లి , ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ వరి కొనుగోలు మరియు లోడింగ్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు అలస్యం జరగకుండా ట్యాబ్ ఎంట్రీలు జరగాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు దాన్యాన్ని తీసుకువచ్చిన రైతులకు, ఎలాంటి ఇబ్బందులు రాకుండా, సజావుగా కొనుగోలు ప్రకీయా పూర్తి చేయాలని, రైతులకు ఇబ్బందులు గురిచేసిన వారు చర్యలకు బాద్యులవుతారని అన్నారు .

వాతావరణంలో మార్పులు అకాల వర్షాబావ పరీస్థితులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోని, దాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు . రైతుల సమస్యలు తెలుసుకోవడం కోసమే సెంటర్లను స్వయంగా తనిఖీ చేసి వెంటనే పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతుల ద్వారా కొనుగోలు కేంద్రాలకు వచ్చే దాన్యం నాణ్యత పరిమాణాలను, తేమశాతం పరిశీలించి, వ్యవసాయ శాఖ అధికారుల దృవీకరించిన దాన్యాన్ని, టోకెన్ పద్ధతి ప్రకారం మాత్రమే కొనుగోలు చేయాలని కేంద్ర నిర్వహకులను, అధికారులను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను ఏ విధంగా పాటిస్తూన్నారు, ఎంత విలువ గల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుంది వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలును వెంటనే తరలించాలని, తగు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, పిడి డిఆర్డిఎ శేషాద్రి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సెంటర్ నిర్వాహకులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడం లక్ష్యం..



- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్.
- కొనరావుపేట మోడల్ స్కూల్,జూనియర్ కాలేజీ ఆకస్మిక తనిఖీ
- మండల పరిషత్ కార్యాలయంలో ఆధికారులతో ప్రత్యేక సమావేశం

**బలగం టీవీ , కొనరావుపేట:**
ప్రభుత్వ విద్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.శుక్రవారం కొనరావుపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్,జూనియర్ కాలేజీ లను ప్రభుత్వ విప్ ఆకస్మిక తనిఖీ చేశారు..ఈ సందర్భంగా పాఠశాలలో,కాలేజీ లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయో అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు..పాఠశాలలో శుద్ధజల కేంద్రంలో ఇబ్బంది ఉందని తెలపగ దానిని పరిశీలించి నూతన ప్లాంట్ ఏర్పాటు చేస్తానని తెలిపారు..మోడల్ స్కూల్ కు బోర్ మోటార్,వంట గది షెడ్డు మంజూరు చేశారు..విద్యార్థుల సౌకర్యార్థం సరైన సమయానికి బస్సు లు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు..విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని పాఠశాల విద్యాలయం బాధ్యులను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటూ బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని,బాత్రూమ్ లు శుభ్రంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు..

**స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి**
మోడల్ స్కూల్ పరిసరాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి చుట్టుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను,కట్టెలను తొలగించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు..

**ఉత్తమ ఫలితాలు సాధించాలిలి**
పాఠశాల కళాశాల విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు..పదవ తరగతిలో 10/10 సాధించాలని తెలిపారు.. 10/10 సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సన్మానం చేపిస్తానని తెలిపారు..అనంతరం కొనరావుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మండల పరిధిలోని పంచాయతీ సెక్రటరీలు,స్పెషల్ ఆఫీసర్లతో, అధికారులతో సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏమైన సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు.. ఇటీవల దసరా, బతుకమ్మ పండుగ విజయవంతంగా నిర్వహించడం పట్ల వారిని అభినందించారు..

**గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలి**
గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లు, ఇన్చార్జిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆయా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ,సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా ఉండేలా చూడాలని ప్రతి వీధులలో, ప్రధాన కూడళ్లలో వీధిలైట్ల వెలిగేల చూడాలని పేర్కొన్నారు.. ప్రభుత్వం అందించే సూచనలను సలహాలు పాటిస్తూ ముందుకు పోవాలన్నారు.. ఈ కార్యక్రమంలో అధికారులు పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు..

# న్యూజిలాండ్ లక్ష్యం 107 పరుగులు




## భారత్ 462 ఆలౌట్

**బలగం టీవి, హైదరాబాద్**

భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు అందుకుంది. ఈ ఇద్దరు యువ బ్యాటర్లు కివీస్ బౌలింగ్‌కు ఎదురొడ్డి నిలిచారు. దేశవాళీ ఫామ్‌ను దిగ్విజయంగా కొనసాగిస్తూ సర్ఫరాజ్ దుమ్మురేపితే..గాయాన్ని కూడా లెక్కచేయకుండా పంత్ పోరాటం చేశాడు. అయితే భారీ లక్ష్యం దిశగా దూసుకెళుతున్న భారత్‌ను హెన్రీ, ఒరూర్కీ మరోమారు దెబ్బతీశారు. వీరి ధాటికి భారత్ 52 పరుగుల తేడాతో చివరి ఏడు వికెట్లు కోల్పోయింది. 107 పరుగుల స్వల్ప లక్ష్యఛేదనలో కివీస్ సఫలం అవుతుందా లేక..వరుణుడి అంతరాయంతో ఆఖరి రోజు ఆట రద్దు అవుతుందా అన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది.

రెండో ఇన్నింగ్స్‌కు భారత్..సర్ఫరాజ్‌ఖాన్(195 బంతుల్లో 150, 18ఫోర్లు, 3సిక్స్‌లు) సూపర్ సెంచరీకి తోడు రిషబ్ పంత్(105 బంతుల్లో 99, 9ఫోర్లు, 5సిక్స్‌లు) వీరోచిత పోరాటంతో 462 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌తో నిరాశపరిచినా..ముంబైకర్ సర్ఫరాజ్ రెండో ఇన్నింగ్స్‌లో అద్భుత శతకంతో కదంతొక్కాడు. ఓవైపు సీనియర్లు నిరాశపరిచినా..అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ భారత్‌ను పోటీలో నిలిపాడు. జడేజా బౌలింగ్‌లో గాయపడ్డ పంత్ పోరాటం ఆకట్టుకుంది. కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన పంత్ పరుగు తేడాతో సెంచరీకి దూరమయ్యాడు. వీరిద్దరు సాధికారిక ఇన్నింగ్స్‌తో కివీస్ ముందు భారత్ లక్ష్యాన్ని నిర్దేశించగల్గింది. అయితే మ్యాట్ హెన్రీ (3/102), ఒరూర్కీ(3/92) మరోమారు చెలరేగడంతో టీమ్‌ఇండియా వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. రాహుల్(12), జడేజా(5), అశ్విన్(15) విఫలం కాగా, బుమ్రా(0), సిరాజ్(0) సున్నాలు చుట్టారు.

సర్ఫరాజ్, రిషబ్ పంత్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఓవైపు సీనియర్లు నిష్క్రమించినా.. ఏమాత్రం వెనుకకు తగ్గకుండా కివీస్ బౌలింగ్ దాడిని కాచుకు కూర్చున్నారు. ఆస్ట్రేలియాపై ఈడెన్‌గార్డెన్స్‌లో ద్రవిడ్, లక్ష్మణ్ ఇన్నింగ్స్‌ను వీరిద్దరు గుర్తుకు తెచ్చారు. పీకల్లోతు కష్టాల్లో ఉన్న జట్టును ఒడ్డుకు చేర్చుతూ పరుగులు కొల్లగొట్టారు. దేశవాళీలో దుమ్మురేపుతున్న సర్ఫరాజ్..కివీస్‌పై అదే పంథాను కొనసాగించాడు. బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా మైదానం నలువైపులా చూడచక్కని షాట్లతో అలరించాడు. మరోవైపు గాయంతో అసలు బ్యాటింగ్‌కు వస్తాడా అన్న అనుమానాలను పటాపంచలు చేసిన పంత్ ఇన్నింగ్స్ ఆదిలో ఒకింత తడబడ్డాడు. ఛేదనకు దిగిన కివీస్..వెలుతురులేమితో ఆట కొనసాగించలేకపోయింది.

**సంక్షిప్త స్కోర్లు**

భారత్ తొలి ఇన్నింగ్స్: 46 ఆలౌట్, న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 402 ఆలౌట్, భారత్ రెండో ఇన్నింగ్స్: 462 ఆలౌట్, న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 0/0




# వైభవోపేతం వెంకన్న రథోత్సవం

**-జాతరలో పోటెత్తిన భక్తజనం**

**బలగం టీవీ , గంభీరావుపేట**

గోవిందా.. గోవిందా.. నామస్మ రణతో గంభీరావుపేట మండలం లింగన్న పేట లో వీధులు మార్మో గాయి. బ్రహ్మాండనాయకుని రథోత్సవానికి ఆశేష భక్తజనం తరలివచ్చారు. శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భాగంగా శుక్రవారం రథోత్సవం వైభవోపేతంగా సాగింది. భక్తుల కోలాటాలు, భజన సంకీర్తనలతో రథ యాత్ర శోభాయమానంగా సాగింది. శ్రీవేంకటేశ్వరస్వామి వారు రథంపై దర్శనం ఇవ్వగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు.

రథోత్సవం సందర్భంగా స్వామిని ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్,టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్రావు,జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్య నారాయణ గౌడ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఏఎంసీ చైర్మన్ విజయ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, సెస్ డైరెక్టర్ నారాయణ రావు,బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు,ఆలయ కమిటీ చైర్మన్ పాపా రావు తదితరులు పాల్గొన్నారు.



# చట్ట వ్యతిరేకంగా వేలం పాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు



## సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి.

**బలగం టీవీ , సిరిసిల్ల :**

నిబంధనలకు విరుద్ధంగా గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహణకు వేలం వేసిన నాలుగురిపై కేసు నమోదు చేసామని, చట్ట వ్యతిరేకముగా వేలం పాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు సిరిసిల్ల డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తంగళ్ళపల్లి మండలంలోని రాళ్లపేట గ్రామస్తులైన మాజీ సర్పంచ్ బాలసాని పరశురాం, బొద్దుల పరుశురాం, గౌర అంజయ్య , సోమ ఎల్లయ్య లు గ్రామంలో మద్యం అమ్మడానికి బెల్ట్ షాప్ నిర్వహణకు వేలంపాట నిర్వహించగా గణాది శ్రీకాంత్ ను బెల్ట్ షాపు నడుపుకొమ్మని అందుకు 66,500/- రూపాయలు డబ్బులు డిమాండ్ చేయగా,శ్రీకాంత్ ని బెదిరించి అతని వద్ద 33,000/- రూపాయలు పెద్ద మనుషులు తీసుకున్నారని తెలిపారు. మిగతా డబ్బులు ఇవ్వాలని, గ్రామంలో గణాది శ్రీకాంత్ తప్ప మిగిలిన ఎవ్వరు బెల్ట్ షాప్ నిర్వహించిన వారికి 50 వేల జరిమానా విధిస్తామని హుకుం జారీ చేసిన బాలసాని పరశురాం, బొద్దుల పరుశురాం, గౌర అంజయ్య , సోమ ఎల్లయ్య లపై కేసు నమోదు చేసి పై ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపించామని,సోమయ్య పరారీలో ఉన్నాడు అని తెలిపారు.

# ప్రతి నియోజకవర్గానికి 4వేల ఇందిరమ్మ ఇళ్లు.. మంత్రి పొంగులేటి

రానున్న నాలుగేండ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్ ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.శనివారం హైదరాబాద్ కలెక్టరేట్ లో గోషామహల్ నియోజవర్గానికి చెందిన లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 144 మంది లబ్దిదారులకు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే నాలుగు సంవత్సరాలలో రాష్ట్రంలో కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు, ఎలాంటి తేడా లేకుండా అర్హులైన పేదవారందరికి ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎలాంటి భేషజాలకు పోకుండా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన వాటా, నిధులు అడిగి తీసుకుంటామని, పెద్ద ఎత్తున రాష్ట్రానికి ఇండ్లను మంజూరు చేయాలని హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర హౌసింగ్ జాయింట్ సెక్రటరీని కోరినట్టు తెలిపారు. గత ప్రభుత్వం పేదవాడి గురించి కనీస ఆలోచన చేయలేదని విమర్శించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందుల ఎదురైనా ప్రతిపక్షాలు కాళ్లల్లో కట్టెలు పెడుతూ అభివద్ధి సంక్షేమాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించినా ఏదీ ఆగదని తేల్చి చెప్పారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ గోల వల్ల తమ ప్రభుత్వానికి వచ్చే నష్టమేమీ లేదని, ఏడాది కూడా పూర్తికాకముందే ప్రభుత్వంపై రోడ్డు ఎక్కడం వల్ల బీఆర్ఎస్‌కే నష్టమన్నారు.

# నేడు మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్

**బలగం టీవి, హైదరాబాద్**

మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్ సమరానికి సర్వం సిద్ధమైంది. ఆదివారం దుబాయి వేదికగా జరిగే తుది పోరులో న్యూజిలాండ్‌తో సౌతాఫ్రికా తలపడుతుంది. ఇరు జట్లు ఇప్పటి వరకు ఒక్కసారి కూడా వరల్డ్‌కప్ ట్రోఫీ సాధించలేదు. ఈసారి గెలిచిన టీమ్ నయా చరిత్ర సృష్టిస్తోంది. సౌతాఫ్రికా తొలిసారి ఫైనల్‌కు చేరింది. న్యూజిలాండ్ గతంలో రెండు సార్లు తుదిపోరుకు అర్హత సాధించినా ట్రోఫీ మాత్రం గెలవలేక పోయింది. ఈసారి ఎలాగైనా కప్పును సాధించాలనే పట్టుదలతో ఉంది. సౌతాఫ్రికాతో పోల్చితే కివీస్ బలమైన జట్టు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే క్రికెటర్లకు జట్టులో కొదవలేదు. సుజీ బేట్స్, జార్జియా, అమెలియా కెర్, కెప్టెన్ సోఫి డివైన్, మాడి గ్రీన్, రోజ్‌మేరీ, కాస్పరెక్, కార్సన్ వంటి మ్యాచ్ విన్నర్లు జట్టులో ఉన్నారు. ఇక సౌతాఫ్రికాలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారు. సెమీస్‌లో ఆస్ట్రేలియా వంటి బలమైన టీమ్‌ను ఓడించడంతో సఫారీ జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. ఫైనల్లో కూడా అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది.